క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



నవాబుపేట: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం మండల వ్యాపార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎస్‌ఐకి రూ. లక్ష విరాళం అందజేశారు. అదే విధంగా వ్యాపార సంఘం అధ్యక్షుడు సుధాకరాచారి జేకే ట్రస్టు ద్వారా రూ. 75వేల విలువగల ఎల్‌ఈడీని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. చోరీలు, నేరాలను అరికట్టేందుకు సీసీ నిఘా ఎంతో అవసరమన్నారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపార సంఘం ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడు గోపాల్‌గౌడ్, కోట్లరాజు, ఇర్షాన్, శ్రీను, రేవణయ్య, సుదర్శన్, శంకర్ నాయక్, శేఖర్, ఫయాజ్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, ఇతర పరికరాలను అందజేశారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో అలింకో హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శారీరక, మానసిక దివ్యాంగులకు వీల్‌చైర్లు, చేతి కర్రలు ఇతర పరికరాలను పంపిణీ చేసినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డా.నాగరాజు, వరప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు రాచాల రాజు, రవి, అశోక్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



దేవరకద్ర రూరల్: మండలంలోని పేరూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం గుడిబండలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గోపన్‌పల్లి, గుడిబండ, మీన్గోనిపల్లి గ్రామాల్లో వైద్యసిబ్బంది గుర్తించిన అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేసినట్లు డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. వ్యాధిగ్రస్తులు సకాలంలో సరైన చికిత్స తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ రాజన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ మహబూబ్ అలీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60వేల చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు చిన్నయ్య, రాజుగౌడ్, శ్రీనివాస్, దినేశ్ ఆచారి, గోపాల్ పాల్గొన్నారు.

దేశంలో నంబర్ వన్‌గా మహీంద్ర ట్రాక్టర్లు



పాలమూరు: దేశంలో నంబర్ వన్ స్థానంలో మహీంద్ర ట్రాక్టర్లు ఉన్నాయని.. 40లక్షలకు పైగా కస్టమర్లతో అతిపెద్ద సంస్థగా నాలుగేళ్లుగా కొనసాగుతున్నట్లు స్థానిక జయరామ షోరూం ఎండీ బెక్కరి రాంరెడ్డి అన్నారు. మహీంద్ర ట్రాక్టర్లతో చేపట్టిన అశ్వమేధ యాగం ర్యాలీ గురువారం జిల్లా కేంద్రానికి చేరుకోగా.. ఆయన ఘనస్వాగతం పలికారు. అనంతరం జయరామ షోరూంలో కేక్ కట్ చేశారు. అశ్వమేధ యాగం చేపట్టిన మహీంద్ర ట్రాక్టర్ల కంపెనీ దేశవ్యాప్తంగా ఐదు ట్రాక్టర్లను తిప్పుతూ తన ప్రస్థానాన్ని చాటుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మహీంద్ర ట్రాక్టర్ల టెరిటరీ మేనేజర్ యాసిఫ్ మొగల్, సీఈఓ సరసయ్య, రామకృష్ణ, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం..



ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారిన బాదేపల్లి-బోయిలకుంట రోడ్డు

- జీటీకి నోచుకోని బాదేపల్లి-బోయిలకుంట రోడ్డు
- 2023లో అప్పటి ఎమ్మెల్యే.. 2024లో ప్రస్తుత ఎమ్మెల్యే శంకుస్థాపన
- బీటీరోడ్డు పనులకు కలగని మోక్షం
- దిష్టిబొమ్మల్లా మారిన శిలాఫలకాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో వ్యాపార కేంద్రంగా ఉన్న బాదేపల్లి నుంచి బోయిలకుంట గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. 2023లో అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి, 2024లో ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బాదేపల్లి-బోయిలకుంట బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఆవిష్కరించిన శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా మారాయి. గుంతలమయంగా మారిన మట్టిరోడ్డుపై రాకపోకలు సాగించలేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే బురదమయంగా మారుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 1.20కోట్లు మంజూరు..

మండలంలోని చర్లపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన బోయిలకుంట బాదేపల్లి పట్టణానికి 1.5 కి.మీ. దూరంలో ఉంది. అయితే బాదేపల్లికి చెందిన రైతుల పొలాలు బోయిలకుంటలో అధికంగా ఉన్నాయి. ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారుల పుణ్యమా అని బోయిలకుంట వరకు ప్లాట్లు సైతం విస్తరించాయి. అయినప్పటికీ బోయిలకుంట బీటీ రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. గ్రామస్తులతో పాటు బాదేపల్లికి చెందిన రైతులు మట్టిరోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీటీరోడ్డు నిర్మించేందుకు ఎస్‌టీఎస్‌డీఎఫ్ నుంచి రూ. 1.20కోట్లు మంజూరయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 అక్టోబర్ 5న అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలు కావడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిపోయింది. ఈ క్రమంలో రోడ్డు పనులు ముందుకు సాగలేదు. నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి. ఎమ్మెల్యేగా గెలిచిన అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులను తిరిగి మంజూరు చేయించి.. గతేడాది డిసెంబర్‌లో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే రోడ్డు పనులు దక్కించుకున్న గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరు శంకుస్థాపన చేసినప్పటికీ 1.5 కి.మీ. బీటీరోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంపై బోయిలకుంట గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.



2023లో గత ఎమ్మెల్యే ఆవిష్కరించిన శిలాఫలకం



2024లో ప్రస్తుత ఎమ్మెల్యే ఆవిష్కరించిన శిలాఫలకం

స్కూల్ బస్సులు కూడా రావు..



వర్షాకాలంలో రోడ్డు మొత్తం బురదమయంగా మారుతుంది. ఈ సమయంలో స్కూల్ బస్సులు కూడా రావు. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు, ఇతర అవసరాల నిమిత్తం బాదేపల్లికి వెళ్లేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా రోడ్డు నిర్మించి మా కష్టాలు తీర్చాలి.

– బాల్‌రాజ్, బోయిలకుంట

త్వరలోనే ప్రారంభం..

బాదేపల్లి-బోయిలకుంట బీటీరోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ అంతా పూర్తిచేసి గుత్తేదారుకు పనులు అప్పగించాం. రూ. 1.20 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీహరి, ఇన్‌చార్జి ఏఈ, రోడ్లు, భవనాలశాఖ

భూ సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు: కలెక్టర్



కాటవరం రెవెన్యూ సదస్సులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల/చిన్నచింతకుంట/మిడ్జిల్/రాజాపూర్/మహమ్మదాబాద్/కోయిల్‌కొండ: భూ భారతి చట్టంతో భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగ చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం అడ్డాకుల మండలం కాటవరంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సును సందర్శించి.. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో ఆరా తీశారు. ఏ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని తహసీల్దార్ శేఖర్‌ను అడిగారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అధికారులు గ్రామాలకే వచ్చి భూ సమస్యలను పరిష్కరించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని.. సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కాగా, కాటవరం శివారులో ఉన్న ప్రభుత్వ భూములపై ఆరా తీశారు. అనంతరం మూసాపేటలో శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించే స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పర్యటన ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ రాజునాయక్‌తో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్ బిన్ ఇక్బాల్, గిర్దావర్ సృజన్, శశికిరణ్, నాయకులు బనదీశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

- చిన్నచింతకుంట మండలం ఉంద్యాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 53 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ఎల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాంలాల్ నాయక్, ఆర్‌ఐలు తిరుపతయ్య, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



మిడ్జిల్ మండలం కొత్తూర్‌లో..

- మిడ్జిల్ మండలంలోని కొత్తూర్, దోనూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. 20 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ యూపీ రాజు వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్, సిబ్బంది రఘు, అంబిక, ధన్వంతరి పాల్గొన్నారు.
- రాజాపూర్ మండలంలోని కల్లెపల్లి, బీబీ నగర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కల్లెపల్లిలో 13, బీబీ నగర్‌లో 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డీటీ భారతి, ఆర్‌ఐ మంజుల, యాదయ్య పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్ మండలం లింగాయపల్లి, కోయిల్‌కొండ మండలంలోని శేరివెంకటాపూర్, ఖాజీపూర్, ఆచార్యాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్లు విద్యాసాగర్‌రెడ్డి, రాజాగణేశ్, ఎస్‌ఐ తిరుపాజీ పాల్గొన్నారు.

సమస్యలు తీర్చాలని వినతి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు జిల్లా జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ప్రీమెట్రిక్ విద్యార్థులకు వసతి ఉందని, ఈ వసతి గృహంలో తగిన మార్పులు చేసి పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని క్యాలిపర్ సెంటర్‌ను టెక్నీషియన్ రిటైర్మెంట్‌తో మూసివేసినట్లు తెలిపారు. వెంటనే కొత్త టెక్నీషియన్ నియమించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ జిల్లా కన్వీనర్ నరేందర్, అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్, ఉపాధ్యక్షులు మధుబాబు, ఎం.రాజు, బిచ్యానాయక్, రంగదాస్, వెంకటేశ్, వీరేష్, భానుప్రకాశ్, మొగులయ్య, బురానప్ప ఉన్నారు.

‘వికసిత్ కృషి సంకల్ప్’తో కొత్త వంగడాలు

నర్వ: కేంద్ర ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా కొత్త వంగడాలను రైతులకు అందిస్తుందని ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్‌డీ ప్రసాద్ అన్నారు. గురువారం పాథర్చేడ్ రైతు వేదికలో ఐసీఏఆర్, ఐఐఓఆర్, కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) ఆధ్వర్యంలో నూనెగింజల పంటల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా సుమారు 1.5 కోట్ల మంది రైతులకు 700 జిల్లాల్లో ప్రత్యేక సంభాషణ ద్వారా నూతన సాంకేతికత, ఉత్పాదకాలు, కొత్తవంగడాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొచ్చిందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు, మట్టి పరీక్షల కార్డులను రైతులకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సైంటిస్టులు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా దేశంలో నూనెగింజల వాడకం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో నూనెగింజల ఉత్పత్తిని బాగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆముదం పంట సాగును బాగా విస్తరించేందుకు తీసుకోవాల్సిన అవసరం, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎప్పుడు ఒకే పంట కాకుండా పంటల మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు ఐసీహెచ్-5 అనే ఆముదం విత్తనాలను ఉచితంగా రైతులకు అందించారు. కార్యక్రమంలో సైంటిస్టులు సురేష్, రాజేందర్‌రెడ్డి, నర్వ ఏఓ అఖిలారెడ్డి, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తాం



వేములలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: రాష్ట్రంలోని ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం వేముల గ్రామంలో గురువారం మహబూబ్‌నగర్ – వేముల ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. ఆరేళ్ల క్రితం నిలిచిపోయిన మహబూబ్‌నగర్ – వేముల షటిల్ బస్సు సర్వీసును ఆయన పునఃప్రారంభించి.. అదే బస్సులో దాసర్‌పల్లి వరకు ప్రయాణించారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు వేముల, దాసర్‌పల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్‌రెడ్డి, శెట్టి శేఖర్, బాలనర్సింహులు, నాగిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నిరంజన్, రాంచందర్, సత్యం, యాదయ్య, కృష్ణయ్య, సుధాకర్, విజయ్‌కుమార్, తాజ్, ఖలీల్, రత్నయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భైరంపల్లిలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి

మిడ్జిల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, భైరంపల్లి, కంచన్‌పల్లి, లింబ్యాతండా గ్రామపంచాయతీల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలు అమలు చేస్తోందన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులు 45 రోజుల్లో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏఈ విజయ్‌కుమార్, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, వెంకటయ్య, సాయిలు, జంగయ్య, పాండు, శ్రీను, రమేశ్, శివ పాల్గొన్నారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



జడ్చర్లలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, తదితరులు

జడ్చర్ల: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత కోరారు. మున్సిపాలిటీలో వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గురువారం 4, 7 వార్డుల్లోలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. డ్రెయినేజీలను పరిశీలించి.. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలనీ వాసులకు తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు..

భూత్పూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. మున్సిపాలిటీలో వంద రోజుల కార్యాచరణ అమలులో భాగంగా పలు వార్డుల్లో కమిషనర్‌తో పాటు వార్డు ఆఫీసర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నర్సింహులు, వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు నరేందర్, పవన్ కుమార్ పాల్గొన్నారు.



భూత్పూర్ పురపాలికలోని అమిస్తాపూర్‌లో..

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

- పీయూ వీసీ శ్రీనివాస్



విద్యార్థినికి అవార్డు ప్రదానం చేస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్, డీఈఓ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటారని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 200 మందికి పైగా విద్యార్థులకు గురువారం బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీయూ వీసీ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎందులోనూ తీసిపోరని.. రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించడం గొప్ప విషయమని అన్నారు. పదో తరగతి తర్వాత ఉపాధి ఆధారిత కోర్సులను ఎంపిక చేసుకోవడం వల్ల జీవితంలో త్వరగా స్థిరపడతారని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదిగి జిల్లా, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య నుంచి మధ్యాహ్న భోజనం వరకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

భూత్పూర్: మండలంలోని కర్వెన రైతు వేదికలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఓ మురళీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో అత్యాధునిక పద్ధతులు, సాగు విధానం, ఎరువుల వాడకం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శంభుప్రసాద్‌కు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శ్రీను, రాజేశ్, ధర్మతేజ పాల్గొన్నారు.

మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్, రాణిపేట, సింగందొడ్డి గ్రామాలకు 33కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని.. వాటి నిర్మాణానికి శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 18 నెలల కాలంలోనే మండలానికి నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న తనిఖీలు



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌గేట్ వద్ద పోలీసులు, పశుసంవర్ధకశాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కర్నూలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో అనుమతి లేకుండా పశువులను తరలించే వాహనాలపై నిఘా పెట్టారు. ఆవులు, ఎద్దులు, గేదెలను తరలించే వాహనాలను పట్టుకుని విచారణ చేస్తున్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు



మిడ్జిల్: అర్హులైన రైతులకు 75 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి మహేందర్ అన్నారు. గురువారం మండలంలోని మున్ననూర్‌లో 42 మంది రైతులకు ఉద్యానశాఖ నుంచి సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, జంగయ్య, వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, నిరంజన్, రాజేందర్‌రెడ్డి, విక్రమ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.